# 34. అమెరికన్ దుశ్శాసనుడు

"వాయిస్సాఫమెరికా విన్నావూ?" అంటూ వేంచేసేడు. మా సుబ్రావు ఓ తెల్లవారుజామునే వగరుస్తూ.

"ఇప్పుడు వినబోతున్నానుగా! కానియ్!" అన్నాన్నేను, నిద్ర చెడగొట్టినందుకు వాడినేమీ అనలేక.

"అమెరికన్ ప్రజాస్వామ్యం వర్ధిల్లాలి!" అనరిచేడు వాడు.

లోపల నిద్రబోతున్న మా బుడ్డోడు ఓ గావురు కేక పెట్టి లేచేడు. ఏడుస్తూ నా వద్దకొచ్చి వాటేసుకున్నాడు.

మా సుబ్రావు మంచి ఉపన్యాసకుడు. పెళ్ళిళ్ళల్లోనైనా, తద్దినాల్లోనైనా సరే అవకాశంవస్తే వదలకుండా ఉపన్యాసాలిచ్చేస్తుంటాడు. అడపాదడపా పత్రికల్లో "ఫలానా వారి శవాన్ని తగలేసే ముందు శ్మశానంలో ఫలానా సుబ్రావు గారు గద్గద కంఠంతో తగలడనున్న శవాన్ని కీర్తించేరు" అని అచ్చవుతూండటం కద్దు.

"నీవు ఉపన్యాసాలివ్వటమే గాక జోకులు కూడా వేయగలవని నా కిప్పుడే తెలిసిందిరా సుబ్రావూ! కంగ్రాచ్యులేషన్స్!" అన్నాన్నేను.

"జోకులు ఏమిటి?" అన్నాడు వాడు తెల్లమొహం వేసి.

"ఇందాక నువ్వు ఏదో వర్ధిల్లాలంటివి గదా! అది చాలా గొప్ప జోకురా నాయనా."

మా వాడికి కోపం వచ్చింది. "ఏమిటీ నీ ఉద్దేశ్యం. అమెరికాలో ప్రజాస్వామ్యం వర్ధిల్లరాదనా?"

"ఎంత మాట! నేనలా అనగలనా! కానీ, తమ్ముడూ, ఎక్కడేనా ఏదేనా వర్ధిల్లాలంటే ముందక్కడ అది కొద్దిగానన్నా వుండివుండాలి గదా!"

మా వాడి కళ్ళెర్రబడ్డాయి. "నిక్సన్ అంతటి మహా మహుడు, అధ్యక్షపదవి లాంటి మహోన్నత పదవికి స్వచ్ఛందంగా రాజీనామా చేశాడే! అది ప్రజాస్వామ్యానికి విజయం కాదా!" అని గుడ్లురిమేడు

"అవును, నిక్సన్ ప్రతిపక్షులకు అది ఘనవిజయమే!"

"కాదు! ప్రజాస్వామ్యానికే ఘన ఘన ఘనా విజయం. ప్రతిపక్షులు కేవలం నిమిత్తమాత్రులు?"

"అవును! నిమిత్తమాత్రులే! నిక్సన్ కుర్చీలో క్రొత్తగా కూర్చున్న పెద్ద మనిషి అననే అన్నాడు గదా! నిక్సన్ విధానాలే కొనసాగుతాయని."

"ఓర్నాయనా! దానర్థం ఇంకొన్ని వాటర్ గేట్లు జరుగుతాయని కాదురా! నీ తెలివి తెల్లారినట్లే ఉంది!"

"మరయితే బంగ్లాదేశ్ లో పాకిస్తానీ ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు మళ్ళీ సెవెన్త్ ఫ్లీట్ ను ఈసారి మరింత ప్రజా స్వామిక పద్ధతిలో పంపుతారనా?"

"నీకు అమెరికామీద అంత అక్కసు ఉండటం బాగో లేదు. బంగ్లాదేశ్ విషయంలో తెలివి తక్కువగా ప్రవర్తించా మని అమెరికాలోని ప్రజాస్వామ్యవాదు లందరూ ఆ తర్వాత కడవల కొద్దీ ఏడ్చారు గదా!"

'అవునవును, ఏడ్చారు! నిక్సన్ రాజీనామా పెట్టినపుడు ఏడ్చినట్లు!"

"నిక్సన్ ఏడ్చాడని నీ కెవరు చెప్పారు. అది ఏడుపు కాదు. ఆనందాశ్రువులవి. ప్రజాస్వామ్య సాంప్రదాయాలను నిలబెట్టేందుకు ఇంత గొప్ప పదవిని త్యాగం చేస్తున్నాను గదా అని ఆనందం ఆపుకోలేక అశ్రువులు రాల్చి ఉంటాడు."

"ఓస్! అంతే గదా! వియత్నాంలో లక్షల మందిని ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే మారణహోమం చెయ్యనందుకు కాదన్న మాట.

"వియత్నాంలో యుద్ధాన్ని ఆపేసిన ప్రజాస్వామ్య వాది గదా నిక్సన్.

"అంతకన్నా ఎక్కువేన్లేరా నాయనా, యుద్ధ విరమణ అంటూ పబ్లిగ్గా ప్రకటనలు చేశాకకూడా ఆ దేశంమీద బాంబుల వర్షం కురిపిస్తూనే ఉన్న ప్రజాస్వామ్య వాది గదా నిక్సనుడు. ఆ మాట నే నొప్పుకుంటాను!"

"ని నోరు మంచిది గాదురా. 'నిక్సనుడు' అంటే నాకు "దుశ్శాసనుడు" అన్నట్లుగా ధ్వనిస్తోంది సుమా!"

'కావచ్చు! ఆ దుశ్శాసనుడు ఒక్కత్తె చీరనే ఒలచాలని చూసేడు. ఈ దుశ్శాసనుడు లక్షల మందివి ఒలిపించేడు."

"ఎంత మాటంటివిరా?"

"కావాలంటే బంగ్లాదేశ్ వెళ్ళు, కాంబోడియాకు వెళ్ళు, వియత్నాం వెళ్లు. మొగుళ్ళు చచ్చి ఏడుస్తున్న వేలాది అరబ్బుల ఆడవాళ్ళను చూడు!''

"అయితే ఈ పాపం అంతా నిక్సన్ నెత్తిన రుద్దాలంటావ్ ?''

'ఓరి, వెర్రివాడా! వాటర్ గేట్ వ్యవహారాలేవీ అసలు పాపాలే గావు. అవి చిల్లర దొంగతనాలు. వీధి రాజకీయ వేత్తల పనులు గానీ, ఓ మహాదేశపు అధ్యక్షుడి లాంటివాళ్ళు చేసే పనులు గావు. మన దేశంలో, మన రాష్ట్రంలో, మన జిల్లాలో, మన తాలూకాలో, మన ఊళ్ళో, మన పేటలో అలాంటి పిక్ పాకెట్లు వేల మంది ఉన్నారు. వాళ్ళంతా రెండే

ళ్ళుగా నానుతున్న ఈ నిక్సన్ వాటర్ గేట్ వ్యవహారంచూసి నవ్వుకుంటుంటారు. వీళ్ళయితే అలాంటివి కన్ను మూసి తెరిచేంతలో మాఫీ చేసేస్తుంటారు"

'దొరికిపోయావ్! అదుగో, అలా ఇక్కడిలాగా మాఫీ గాకుండా ఉండంచేసే అమెరికన్ ప్రజాస్వామ్యం విలువ తెలియటం లేదా?"

'తెలుస్తూనే ఉంది! మన దుశ్శాసనుడు రారాజుకు నౌకరు. వాడికి దుర్యోధనుడి ఆర్డర్లు పాటించటమే ప్రజాస్వామ్యం. నిక్సనుడు తనకు చందాలిచ్చి గెలిపించే వాళ్ళకూ తనకు ఆ కుర్చీని ఇప్పించ గలవాళ్ళకూ గులాము. వాళ్ల ప్రయోజనాలను కాపాడటమే అతని దృష్టిలో ప్రజాస్వామ్యం. అందుకే రెండేళ్ళుగా తనేంచేసినా దేశప్రయోజనాలకేనని దబాయిస్తూ రాగలిగాడు. అటు వాడూ, ఇటు వీడూకూడా నిమిత్త మాత్రులు. వాళ్లురా నాయనా అసలు మనుషులూ, ప్రజా స్వామ్యానికి భాష్యం చెప్పే ఘనులూనూ'

"అయితే నిక్సన్ నిర్దోషి అంటావా ఏమిటి?"

"మన పేటలో బాబుల్ గాడు లేడూ! వాడికి చేసేందుకు పనిలేదు. తినేందుకు తిండిలేదు. కండపుష్టి తప్ప అమ్ముకునేందుకు ఇంకేంలేదు. వాడికి అరబుడ్డీ పోసి, అర్ధ నూటపదహార్లిచ్చి అవసరం ఉన్న వాళ్ళు ఖూనీలు చేయించటం లేదూ! చేసినందుకు వాడుదోషే! మరై తేచేయిం చేవాళ్లమాటేమిటి?

బాబుల్‌గాడిని ఉరితీసే ముందు వీళ్లని మాత్రం చిత్రవధ చేయటం ప్రజాస్వామ్యం కాదా!"

"మరైతే నువ్వనేదేమిటి?"

"రామాయణం అంతా విని సీతమ్మ వారిని గురించి ప్రశ్న వేసినవాడు నీకన్నా యోగ్యుడు! సర్వాధికారాలూ, సాధన సంపత్తులూ పిడికిట్లోనే ఉండికూడా అధ్యక్ష స్థానంలో ఉన్న నిక్సన్ ఇలాంటి అప్రాచ్యపు పనులు చెయ్యాల్సొచ్చిందంటే ఆ దేశంలో ప్రజాస్వామ్యం ఎలా వున్నదీ నీకర్థం కావడంలేదా!"

"అయితే..."

"అయితే. గియితే ఏం లేదు. అక్కడెవడో గద్దెదిగి ఇంకెవడో ఎక్కితే నీకూ, నాకూగానీ ఆ దేశంలోని నీ-నా బోటి వాళ్ళకుగానీ ఒరిగి చచ్చేదేంలేదు. మారవలసింది మనుష్యులు కాదురా నాయనా. వ్యవస్థ! ఏమీ లేనిదానికి మనం చంకలు గుద్దుకోవటం దేనికి!"

"అంతేనంటావా?"

"ఓ నిరాక్షేపణీయంగా!"

[సెప్టెంబరు 1974]